క్లుప్తంగా

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రాచర్ల అప్పలరాజు, ఎంపీడీవో పి.సూర్యనారాయణ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అందజేత, ధ్రువీకరణ పత్రాల మంజూరు, మ్యుటేషన్ ప్రక్రియలో అలసత్వానికి తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలని సూచించారు.

తీరిన మంచినీటి సమస్య



కళాశాలకు మంజూరైన ఆర్వో ప్లాంట్

మందస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎప్పటి నుంచో మంచినీటి సమస్య వేధిస్తోంది. దీంతో నాడు-నేడు పనుల్లో భాగంగా కళాశాలలో సుమారు రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంట్ మంజూరయ్యింది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు మంచి నీటి సమస్య తీరిందని, భవనాలు కొరత మరికొద్ది రోజుల్లో తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో బొడ్డు ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు ఆర్.లవకుమారి, ఎల్.సోమేశ్వరరావు, హనుమంతు విజయలక్ష్మి, ఎస్.సంగీత, కుర్మాపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయండి'



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మందస: ఈనెల 15వ తేదీ నుంచి పాట్నాలో జరగనున్న సీపీఐఎంఎల్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐఎం లిబరేషన్ పార్టీ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, మద్దిల రామారావు, కైలాస్, అప్పయ్య, అప్పారావు, పాపయ్య, రామారావు, బైనపల్లి రాజారావు, దుష్యంత్, దాలమ్మ, ఈశ్వరి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన జగన్‌మోహన్



మార్పు జగన్‌మోహన్

నందిగాం: మండలంలోని పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన మార్పు జగన్‌మోహన్ మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటాడు. జగన్‌మోహన్ తండ్రి ధర్మారావు స్వగ్రామం పెద్దలవునిపల్లి కాగా తెలంగాణ ఆర్టీసీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి విశాలాక్షి గృహిణి. హైదరాబాద్‌లోని చైతన్య జూనియర్ కాలేజీలో చదువుతున్న జగన్‌మోహన్ 99.907 శాతం మార్కులు సాధించాడు.

వేగవంతంగా ఆధార్ అనుసంధానం



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం/రూరల్: ఓటరు కార్డులకు ఆధార్ కార్డుల అనుసంధానం వేగవంతంగా చేయాలని ఎన్నికల అధికారి సుమబాల ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



యువకుడి తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన పులారి జగ్గారావు అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పలాస మండలం, పలాస-కాశీబుగ్గ యాదవ కుల సంక్షేమ సంఘ పెద్దలు అండగా నిలిచారు. పలాసలో ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడిని బుధవారం పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అవసరం మేరకు రక్తదానం సైతం చేశారు.

గడప గడపలో సంతోషాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- బూరగాంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కంచిలి: సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్ తదితరులు

కంచిలి: వైఎస్సార్‌సీపీ పాలనలో గడప గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేశారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రజలకు మంచి చేసేందుకు అనునిత్యం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్ కార్పొరేషన్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఇచ్ఛాపురం ఏఎంసీ అధ్యక్షుడు నూతలపాటి బాబూరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మాస్టీల మంజు, ఎంపీటీసీ సభ్యురాలు మడ్డు ఢిల్లమ్మ, మడ్డు వెంకటరావు, మద్దిల ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు పనిచేయాలని పిరియా సాయిరాజ్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ అధ్యక్షతన వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో అవగాహన, శిక్షణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ మహిళలంతా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో, అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్లా సుగుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, ఏఎంసీ చైర్మన్ ఎన్.బాబురావు, పార్టీ నాయకులు పిలక సంతు, చాట్ల తులసీదాస్, ప్రకాశరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌సోర్‌తోనే సాగునీరు



మాట్లాడుతున్న వెంకటరావుదొర, తదితరులు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గానికి ఆఫ్‌సోర్‌తోనే సాగునీరు, మున్సిపాలిటీకి తాగునీరు అందుతుందని దివంగత మాజీ ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర సోదరుడు హనుమంతు వెంకటరావుదొర, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబులు అన్నారు. బుధవారం అప్పయ్యదొర జయంతి సందర్భంగా కాశీబుగ్గలోని కేటీరోడ్డులో ఉన్నటువంటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఆఫ్‌సోర్‌ను, తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేస్తారన్నారు. పనుల పునః ప్రారంభం విషయాన్ని సీఎం వద్ద ప్రస్తావించనున్నట్లు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలియజేశారన్నారు. నిజాయితీకి నిలువెత్తు రూపం అప్పయ్యదొర అన్నారు. ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అవసరమని వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అప్పయ్యదొర కుటుంబ సభ్యులు విశ్రాంత జడ్జి దుప్పల వాసుదేవరావు, రామ్మోహన దొర, రంగారావు దొర, రాజ్యలక్ష్మి దొర, ఒడిశి బాలకృష్ణ, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, మల్లా సురేష్, తమ్మినాన శాంతారావు, మరడ భాస్కరరావు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి



పలాస: అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



కాశీబుగ్గ: కాశీబుగ్గలో బోర్డులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పలాస: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణారావు అన్నారు. మండలంలోని సవరపేటలో మద్యం, మాదకద్రవ్యాలపై బుధవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్ వద్దు- ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ముఖ్య కూడళ్లు, పాఠశాలలు, కళాశాలల వద్ద ఎస్ఈబీ అధికారులు డ్రగ్స్‌పై హెచ్చరిస్తూ హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ఈబీ పలాస సీఐ కోన కృష్ణారావు ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. డ్రగ్స్ అమ్మినా, దాచిపెట్టినా 14500 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కవిటి: పూజలందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి



కాశీబుగ్గ: నెమలి కొండపై ఏర్పాటు చేసిన గోవింద నామం

కవిటి: మండలంలోని కవిటి కొత్తూరులో ఉన్న అలివేలు మంగ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. లోళ్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు అప్పలస్వామి బృందం పర్యవేక్షణలో ఆగమశాస్త్ర సాంప్రదాయంలో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం కవిటి, కవిటి కొత్తూరు పరిసర గ్రామాలకు చెందిన 1,500 భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నెమలి కొండపై వేంకటేశ్వర నామాల ఆకృతి గల నూతన నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ వెలుగుల్లో ఈ నామం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు, జాతీయ రహదారితో పాటు సుమారు పది కిలోమీటర్ల దూరం వరకు కనబడుతోంది. ఈ నిర్మాణానికి సుమారు రూ.80 వేలను సచివాలయం, హౌసింగ్, ఇంజినీరింగ్ ఉద్యోగులతో పాటు యువకులు అందజేశారు.

సంక్షిప్తంగా...

వ్యాధులపై అప్రమత్తత అవసరం

టెక్కలి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యురాలు నీతు సూచించారు. మండలంలోని పోలవరం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల శరీరంపై ఎటువంటి మచ్చలు కనిపించినా తక్షణమే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరోగ్య కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.సింహాచలం, డి.రోహిణి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

12న క్విజ్ పోటీలు

పలాస: స్థానిక శ్రీరామకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవా సంఘం 64వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు పలాసలోని సంఘ భవనంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 'నూతన జాతీయ విద్యావిధానం దేశ అవసరాలను తీర్చగలుగుతుందా' అనే అంశంపై వ్యాస రచన, 'ఇంటర్నెట్ వినియోగం- దుష్ప్రభావాలు, ప్రయోజనాలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. క్విజ్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఒక టీమ్‌గా ఉండాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 94915 69453, 94410 58531 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉచిత ఉపాధి శిక్షణ

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగులకు బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంభాషా బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రెండు రకాల కోర్సుల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 9వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరవ్వాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 95028 25143 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తక్షణ సాయం అందజేత

కంచిలి: మండలంలోని గోకర్ణపురం సచివాలయం పరిధి శాసనాం గ్రామానికి చెందిన మామిడిపల్లి చక్రపాణి ఇటీవల మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను అతని కుటుంబ సభ్యులకు ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు, శాసనాం సర్పంచ్ గుడ్డిపల్ల వేణుల చేతులమీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వాసు తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 25వ వార్డు శ్రీనివాసనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు బుధవారం భూమిపూజ చేశారు. 14 ఆర్థిక సంఘ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోర చంద్రకళ, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, బోర భగవతి, పప్పల ప్రసాద్, బోనెల రాము, బల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లిలో గురువారం ఉదయం 9.30 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమానికి మంత్రి సీదిరి అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరవ్వనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శుద్ధజల పథకానికి శంకుస్థాపన నేడు

వజ్రపుకొత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు శుద్ధ జలాలు అందించే బృహత్తర పథకాన్ని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

టెక్కలి రూరల్: స్థానిక చిన్న బజార్‌లో ఉన్న చేపల మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ తెలియజేశారు. టెక్కలిలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మత్స్యకారులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, మత్స్యకార సొసైటీ సభ్యులతో సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. దీనికి సొసైటీ సభ్యులు సహకరించాలని కోరారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కె.వినోద్, మత్స్యశాఖ అధికారి పాత్రో, అసిస్టెంట్ మధు, మత్స్యకార సొసైటీ నాయకుడు హేరంబో తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- శ్రీకృష్ణపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాలతలగాం పంచాయతీ శ్రీకృష్ణపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కార మార్గాలను చూపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి,, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సతీష్, ఎం.అప్పారావు, ఎస్.భీమారావు, పి.రామకృష్ణ, అట్టాల అప్పలనాయుడు, ఎన్ని మన్మథరావు, ఉప్పాడ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

జీడి ఉత్పత్తుల పెంపునకు చర్యలు



భవన నిర్మాణానికి భూమి చేస్తున్న దృశ్యం

మందస: ఉద్దానం మాదిరిగానే గిరిజన ప్రాంతాల్లో జీడి ఉత్పత్తిని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ తెలియజేశారు. మండలంలోని టంగరాపుట్టి పంచాయతీలో జీడి ఉత్పత్తిదారుల సంఘం భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యానవనశాఖ ద్వారా గిరిజన ప్రాంతాల్లో కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, గిరిజన రైతుల జీడిపంటను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కలెక్షన్ కేంద్రాల నిర్మాణానికి రూ.15 లక్షలు ఖర్చు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్నాని ఆదినారాయణ, టంగరాపుట్టి, కొండలోగాం, కుసుమ గ్రామాల సర్పంచ్‌లు సవర నవిత, సవర రోజా, సవర సుధాకర్, ఎంపీటీసీ సవర ఢిల్లేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, బాలిగాం పీఏసీఎస్ అధ్యక్షుడు సార్ర ఢిల్లేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వర బృందావన్, ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ శంకర్‌దాస్, పార్టీ నాయకులు సవర ఢిల్లేశ్వరరావు, సవర రాము, బాలకృష్ణ, డొంబురు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిదర్శనం అప్పయ్యదొర



అప్పయ్యదొర విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నందిగాం: రాజకీయాల్లో నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం టెక్కలి మాజీ ఎమ్మెల్యే దివంగత హనుమంతు అప్పయ్యదొర అని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం అప్పయ్యదొర జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ నందిగాం మండలానికి అప్పయ్యదొర చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కురమాన బాలకృష్ణారావు, సర్లాన బైరాగి, వైస్ ఎంపీపీ సువ్వారి వసంత్ కుమార్, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, పుష్పా సత్యం, బార్నాన బాలకృష్ణ, చింతాడ శ్రీనివాస్, కింతల శేషగిరి, పాపారావు, తమిరె రాజు, దాలయ్య, మల్ల సీతారాం, హనుమంతురావు, సోమేశ్వరరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ బోర పుష్ప బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకంలో జగనన్న గోరుముద్ద మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామారావు, ఎంపీటీసీ పిట్ట హేమలత, సర్పంచ్ ఆశి దాలయ్యరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పిట్ట ఆనంద్, మండల జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, గ్రామపెద్ద తిప్పన నాగరాజురెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ గొర్లె తిరుమలరావు, హెచ్ఎం శాంతీకుమారిలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 31 వార్డుల్లో పారిశుద్ధ్యంపై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శానిటేషన్ అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను జేసీబీలతో తొలగించారు. మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, కమిషనర్ టి.రాజగోపాలరావు తదితరులు పర్యవేక్షించారు.

రుణాల రికవరీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాలకు రికవరీ తప్పనిసరిగా ఉండాలని సెర్ప్ ఏపీఎం ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో సీఏఫ్, వీవోఏలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఇచ్ఛాపురం ఆదర్శ మండలం కావడంతో నెలవారీ సమావేశాలు, పుస్తక నిర్వహణ, సంఘాల గ్రేడింగ్, ఆర్థిక లావాదేవీలు పక్కాగా ఉండాలని సూచించారు.

శుభాకాంక్షలు



స్పీకర్ తమ్మినేని సీతారాంకు కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్దకు బుధవారం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు.

– ఆమదాలవలస

కుష్టు వ్యాధిపై అవగాహన



కుష్టుపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో దానమ్మ

ఇచ్ఛాపురం రూరల్: చిన్నారుల నుంచి పెద్దల వరకు ముందస్తుగానే లెప్రసీ వ్యాధి లక్షణాలను గుర్తించవచ్చని సీహెచ్‌వో ఎస్.దానమ్మ అన్నారు. మండలంలోని మండపల్లి పంచాయతీ భవానీపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై ఉండే స్పర్శ లేని మచ్చలు, నాడుల వాపు ఆధారంగా ఈ వ్యాధి నిర్ధారణ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో పి.ప్రసాదరావు, అంగన్‌వాడీ టీచర్ బల్రి నరసమ్మ, ఏఎన్ఎం ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.